షెడ్యూల్డ్ కులాల సంక్షేమం

వైవిధ్యానికి మారుపేరైన భారతదేశంలో వివిధ కులాల, తెగలు, జాతులకు సంబంధించిన ప్రజలు నివసిస్తున్నారు. సామాజిక చట్రంలో షెడ్యూల్డ్ కులాలు, తెగలు అట్టడుగునున్నారు. చరిత్రాత్మకంగా కొనసాగుతున్న వివక్ష విధానం వల్ల ఈ వర్గానికి చెందిన ప్రజలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారు. బ్రిటిష్ హయాంలో వీరికోసం కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా ప్రగతి అంతంతమాత్రమే. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగ పరమైన, చట్టపరమైన రక్షణలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ఈ వర్గాల ప్రగతికి దోహదం చేస్తున్నాయి.

షెడ్యూల్డ్ కులాలు

1935 భారత ప్రభుత్వ చట్టం కొన్ని కులాలను, తెగలను వాటి వెనుకబాటు ప్రాతిపదికగా కొన్ని చట్టపరమైన రక్షణలు కల్పించడానికి వీలు కలిగించింది. సమాజంలో మిగిలిన వర్గాలు చేపట్టడానికి ఇష్టపడని వృత్తులను కొనసాగించడం ద్వారా జీవించే ప్రజానీకమే షెడ్యూల్డ్ కులాలు. పారిశుద్ధ్యం, జంతు, మానవ కళేబరాల తొలగింపు, తోళ్ళ వృద్ధి మొదలైన విధులను నిర్వహించే ఈ వర్గాలను అస్పృశ్యులుగా పరిగణిస్తారు. 2001 జనాభా లెక్కల ప్రకారం 16.66 కోట్ల మంది, వీరి సంఖ్య జనాభాలో 16.23 శాతం. వీరు ప్రధానంగా వ్యవసాయ కూలీలుగా, పారిశుద్ధ్య పనివాళ్లుగా జీవనోపాధిని పొందుతున్నారు. అభివృద్ధి సూచికలన్నిటిలో వీరు జాతీయ సగటు కంటే వెనుబడి ఉన్నారు. అక్షరాస్యత జాతీయ స్థాయిలో 65 శాతం కాగా వీరిలో కేవలం 54 శాతం మాత్రమే. 78 శాతం షెడ్యూల్డ్ కులాల వారు భూకమతాలు లేని వ్యవసాయ కూలీలు. 48 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారు. 80 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చొరవతో ఈ వర్గాలకు రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించారు. ప్రాథమిక హక్కుల విభాగంలో 14, 15, 16 ప్రకరణల ద్వారా 'చట్టం ముందు సమానత్వం, కుల, మత, తెగ ప్రాతిపదిక మీద వివక్ష లేకుండుట, ప్రభుత్వ ఉద్యోగాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం' మొదలైన రక్షణలు కల్పించారు. 17వ ప్రకరణ అస్పృశ్యతను పాటించడం నిషేధిస్తుంది. 15(4)వ ప్రకరణ కింద విద్యారంగంలో రిజర్వేషన్, 16(4)(ఎ), (బి)ల ప్రకరణ కింద ఉద్యోగాలతోపాటు పదోన్నతుల్లో కూడా రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఆదేశ సూత్రాల్లో 39వ ప్రకరణ ఉచిత న్యాయసలహా పొందడానికి అవకాశం కల్పిస్తే, 46వ ప్రకరణ ఆర్థిక, విద్యా ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాల్సిన బాధ్యతను ప్రభుత్వం మీద ఉంచుతుంది. 330, 332వ ప్రకరణలు లోక్‌సభ, విధాన సభల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే, 338వ ప్రకరణ కింద బహుళ సభ్య జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఏర్పాటవుతుంది. పైన వివరించిన రాజ్యాంగపరమైన రక్షణలతో పాటు పార్లమెంటు 1955లో పౌరహక్కుల చట్టాన్ని ఆమోదించి, అంటరానితనం కారణంగా వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను నేరంగా పరిగణిస్తోంది. 22 రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సంచార న్యాయ స్థానాలు ఈ కేసులను పరిష్కరించడానికి ఏర్పాటు చేశారు. 1989 షెడ్యూల్డ్ కులాల, తెగల మీద జరిగే అత్యాచారాలను నివారించే చట్టం.. బలహీన వర్గాల మీద జరిగే అత్యాచారాలను నిరోధించడానికి ఉపయోగపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో అత్యాచారాలకు సంబంధించిన కేసులను విచారించడానికి ప్రత్యేక న్యాయ స్థానాలను ఏర్పాటు చేశారు.

ఆర్థిక అభివృద్ధి

షెడ్యూల్డ్ కులాలు, తెగల ఆర్థిక సాధికారికత మిగిలిన రంగాల్లో స్వాధీనతకు దోహదం చేస్తుంది. వీటిలో ప్రధాన కార్యక్రమాలు.

1) 1979లో ప్రారంభించిన షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక ప్రణాళికా కార్యక్రమం ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికగా కొనసాగుతోంది. దారిద్ర్యరేఖకు దిగువన నివసించే షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. 2006-07 ఆర్థిక సంవత్సరంలో రూ.460 కోట్లను కేంద్రం రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ పథకం కింద విడుదల చేసింది.
2) షెడ్యూల్డ్ కులాల ప్రజల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి తగిన శిక్షణనిస్తూ స్వయంఉపాధి పథకాల ప్రోత్సాహానికి జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి రుణసదుపాయం కల్పిస్తున్నారు. ''మహిళా సమృద్ధి యోజన'' దీని ద్వారా అమలు చేస్తున్నారు. ప్రతి ఏటా 50 వేలకు పైగా ఔత్సాహికులు లబ్ధి పొందుతున్నారు.
3) జాతీయ సఫాయీ, కర్మచారి ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్ పారిశుద్ధ్య పనివాళ్ల ప్రయోజనం కోసం ఏర్పాటైంది. ఈ వ్యవస్థ వారికి ఆ వృత్తి నుంచి విముక్తి కల్పిస్తూ స్వయం ఉపాధిని కల్పించేందుకు తక్కువ వడ్డీతో రుణ సౌకర్యాలను అందజేస్తుంది. గత ఏడాది ఇది 78,000 మంది లబ్ధిదారులకు రుణ సహాయాన్నందించింది.
4) రాష్ట్రస్థాయిలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్పొరేషన్, స్వచ్ఛంద సేవాసంస్థలు తమ వంతుగా వెనకబడిన ప్రజల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్నాయి.

విద్యాభివృద్ధి

అణగారిన వర్గాల శృంఖాలను విడగొట్టడానికి ఉపయోగపడే శక్తివంతమైన ఆయుధం విద్య. వివక్షకు లోనవుతున్న షెడ్యూల్డ్ కులాల్లో అక్షరాస్యత అంతంతమాత్రమే. ముఖ్యంగా తోటివారు అసహ్యించుకునే వృత్తుల్లో నిమగ్నమైన ప్రజల్లో అక్షరాస్యత మరింత తక్కువ. ఆకారణంతోనే పారిశుద్ధ్య పనివాళ్ల పిల్లలకు పాఠశాల స్థాయిలోనే ఉపకార వేతనాలు అందిస్తున్నారు. కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో వార్షిక ఆదాయం లక్షలోపు ఉన్న కుటుంబాల పిల్లలకు ఉపకారవేతనాలు అందిస్తున్నారు. ఈ కులాల విద్యార్థుల ప్రతిభను పెంచడానికి రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటయ్యాయి. పోటీ పరీక్షల శిక్షణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటయ్యాయి. విద్యార్థి, విద్యార్థినులకు వసతి గృహాలు, ఎం.ఫిల్., పీహెచ్‌డీ స్థాయి విద్యనభ్యసించే వారికి, ఇతర దేశాల్లో విద్యనభ్యసించేవారికి స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు.

ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఈ విధంగా రావొచ్చు

1) 'షెడ్యూల్డ్ కులం'

ఎ) రాజ్యాంగంలో నిర్వచించారు

బి) పార్లమెంటు చట్టం ద్వారా నిర్వచించింది

సి) ఆయా రాష్ట్రాలు చట్టరీత్యా నిర్వచించాయి

డి) ఎక్కడా అధికారయుతంగా నిర్వచించలేదు

2) పౌరహక్కుల చట్టం – 1955

ఎ) ప్రాథమిక హక్కులను అమలు చేయనుద్దేశించడానికి

బి) అస్పృశ్యత నివారణకు ఉద్దేశించింది

సి) అణగారిన వర్గాలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు ఉద్దేశించింది

డి) కులవ్యవస్థ రూపుమాపనుద్దేశించింది

3) ఏ రాజ్యాంగ సవరణ చట్టం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్‌కు రాజ్యాంగపర హోదాను కల్పించింది?

ఎ) 65 బి) 89 సి) 85 డి) 82

4) ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాల, తెగలకు ఏ రాజ్యాంగ ప్రకరణ మేరకు రిజర్వేషన్ లభించింది?

ఎ) 15 బి) 16

సి) 16 (4ఎ) డి) 16 (4బి)

5) కింది రాష్ట్రాల్లో ఏ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలవారికి పంచాయతీ రాజ్ వ్యవస్థలో రిజర్వేషన్ వర్తించదు?

ఎ) నాగలాండ్ బి) మణిపూర్

సి) సిక్కిం డి) అరుణాచల్ ప్రదేశ్

6) ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా షెడ్యూల్డ్ కులాల, తెగల ప్రభుత్వోద్యోగులకు పదోన్నతిలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది?

ఎ) 82 బి) 83 సి) 85 డి) 81

7) ''ఏ పౌరుడు మత, జాతి, కుల, లింగ, ప్రాంత ప్రాతిపదిక మీద ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో వివక్షకు గురికాకూడదు'' అనే ప్రాథమిక హక్కు ఏ ప్రకరణలో ప్రస్తావించారు?

ఎ) 14 బి) 15 సి) 16 డి) 17

8) ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాల, తెగల, వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ సదుపాయం ఏ ప్రాథమిక హక్కుకు మినహాయింపునిస్తుంది?

ఎ) చట్టం ముందు సమానత్వం

బి) మత, జాతి, కుల, లింగ, పుట్టుక స్థల ప్రాతిపదికగా వివక్షత చూపడం నిషేధం

సి) అంటరానితనం పాటించడం నిషేధం

డి) ప్రభుత్వ ఉద్యోగాల్లో అందరికీ సమానావకాశాలు

9) 'సమన్యాయం, ఉచిత న్యాయ సహాయం' ఆదేశ సూత్రం ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు?

ఎ) 7 బి) 42 సి) 25 డి) 44

10) ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటైంది?

ఎ) 89 బి) 88 సి) 87 డి) 86

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10
	A	B	A	C	D	C	C	D	B	A

షెడ్యూల్డ్ తెగలు... సంక్షేమ యంత్రాంగం

ఆదిమ వాసులని పిలిచే షెడ్యూల్డ్ తెగల వారు సంచార జీవనాన్ని గడుపుతూ.. పర్వత, అరణ్య ప్రాంతాల్లో జీవిస్తుంటారు. సంతతి, సంస్కృతి పరంగా మిగిలిన ప్రజలతో పోలిస్తే వీరు ప్రత్యేకంగా ఉంటారు. 2001 జనాభా లెక్కల ప్రకారం జనాభాలో వీరి వాటా 8.2 శాతం(8.43 కోట్లు). భారతీయ సామాజిక వ్యవస్థలో అట్టడుగున ఉన్న వర్గమిది. అస్పృశ్యతకు గురికాకపోయినా సమాజంలో ఎక్కువగా దోపిడీకి గురవుతున్న వర్గమిదే. సామాజిక, రాజకీయ స్పృహ లోపించడం, నిరక్షరాస్యత, పేదరికం మొదలైనవి వీరి ప్రగతికి ప్రతిబంధకాలు. వీరు మిగిలిన వర్గాలతో కలవడానికి ఇష్టపడరు. వీరి వంశపారంపర్య వృత్తులు వ్యవసాయం, వేట, నేత తదితరాలు. అభివృద్ధి సూచికల్లో మిగిలిన వర్గాలన్నింటికంటే వెనుకబడి ఉన్నారు. రాజ్యాంగంలోని 366వ ప్రకరణలోని 25వ నిబంధన షెడ్యూల్డ్‌తెగను నిర్వచిస్తుంది. ఈ తెగల ప్రయోజనాలను పరిరక్షించడానికి 244(1), 244(2) అయిదో, ఆరో షెడ్యూళ్లలో వివరణలు ఇచ్చారు. మధ్య భారత రాష్ట్రాల్లో నివసించే షెడ్యూల్డ్ తెగలవారు అయిదో షెడ్యూల్డు పరిధిలోకి వస్తే... అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లోని ఆరో షెడ్యూలు పరిధిలోకి వస్తాయి. అయిదో షెడ్యూలు పరిధిలో నివసించే ప్రజల భూసంబంధ హక్కులను పరిరక్షించడానికి ఆ రాష్ట్ర గవర్నరు ప్రత్యేక నిబంధనలను రూపొందించవచ్చు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలను కూడా షెడ్యూల్డ్ ఏరియా పరిధి నుంచి గవర్నరు మినహాయించవచ్చు. ఆరో షెడ్యూలు పరిధిలోకి వచ్చే ప్రాంతాలను 'ఆదిమవాస ప్రాంతాలు'గా పరిగణిస్తారు. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజల ప్రయోజనం కోసం 'స్వతంత్ర్య ప్రతిపత్తి కలిగిన జిల్లాల, ప్రాంతాల' ఏర్పాటుతోపాటు వాటి నిర్వహణకు 'జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లు' ఏర్పాటవుతాయి. ఈ మండళ్లు శాసన, కార్యనిర్వాహక, న్యాయ సంబంధ విధులను నిర్వహిస్తాయి. గవర్నరు అనుమతితో ఈ మండళ్లు ప్రాథమిక విద్య, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్లు, రోడ్లు, రవాణా సౌకర్యాల ఏర్పాటువంటి విధులను నిర్వహిస్తాయి. పౌర, నేరస్మృతి నిబంధనల మేరకు కొన్ని ప్రత్యేక తరగతులకు చెందిన నేరాలను విచారించడానికి, పన్నులు విధించి వసూలు చేయడానికి, ప్రకృతి వనరుల నిర్వహణకు ఈ మండళ్లకు ప్రత్యేక అధికారాలున్నాయి.

షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాల పరిరక్షణకు రాజ్యాంగంలో ప్రస్తావించిన అంశాలన్నీ వీరికి వస్తాయి. (14, 15, 16, 17, 39, 46, 330, 332 ప్రకరణలు). 89వ రాజ్యాంగ సవరణ చట్టం మేరకు వీరి ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేకంగా షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఏర్పాటైంది. 93వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రైవేటు విద్యా సంస్థల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. 275(1) నిబంధన మేరకు 'షెడ్యూల్డ్ ప్రాంతాల' పరిపాలనకు కేంద్ర ప్రభుత్వం ధన సహాయం అందిస్తుంది. 339వ ప్రకరణ కింద కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కార్యక్రమాల అమలుకు రాష్ట్రాలకు అవసరమైన నిర్దేశాలు జారీ చేయవచ్చు. ఈ క్రమంలో చట్టపరంగా 1955 పౌరహక్కుల చట్టం, 1988 షెడ్యూల్డ్ కులాల, తెగలపై అత్యాచార నిరోధ చట్టాన్ని రూపొందించారు.

షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి ఆర్థిక, విద్యా రంగాల్లో సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే కార్యక్రమాలు.. షెడ్యూల్డ్ కులాల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను పోలి ఉంటాయి. 2007 నుంచి అమల్లోకి వచ్చిన షెడ్యూల్డ్ తెగల వన్యహక్కుల చట్టం... ఆదిమ వాసులకు వారు అరణ్య ప్రాంతాల్లో తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూమిపై హక్కు కలిగించింది. దీని ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే రుణ, సబ్సిడీ సదుపాయాలను అనుభవించడానికి వీలవుతుంది.

గత 60 ఏళ్లుగా ఈ వర్గాల సముద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నా ఆశించిన మేరకు ప్రగతిని సాధించలేదు. అందుకు కారణాలెన్నో. నాయకుల్లో చిత్తశుద్ధి లోపం, ఉద్యోగస్వామ్యనకారాత్మక వైఖరి, వనరుల కేటాయింపు సరిపడ లేకపోవడం. ఒకవేళ కేటాయించినా సకాలంలో విడుదల చేయక పోవడం, అరకొరగా విడుదల చేయడం, లబ్ధిదారుల ఎంపికలో శాస్త్రీయత లోపించడం.. షెడ్యూల్డ్ కులాలు, తెగల్లో తగిన రాజకీయ చైతన్యం లేకపోవడం, మిగిలిన సమాజపు నిర్లిప్త ధోరణి, రిజర్వేషన్ సౌకర్యాలను.. ఈ వర్గాల్లో సంపన్నవర్గమే అనుభవించడం వంటివి వైఫల్యాలకు ప్రధాన కారణాలు.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. 2001 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ తెగల జనాభా శాతం?

ఎ)18.2 బి)2.8 సి)8.2 డి)12.8

2.జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ప్రస్తుత అధ్యక్షుడు?

ఎ) ఉర్మిళా సింగ్ బి)ఎన్.ఎం.కాంబ్లే

సి) గిరిజావ్యాస్ డి)బూటాసింగ్

3. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసిస్తున్న తెగల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ రాజ్యాంగ ప్రకరణ కింద నిధులను సమకూరుస్తుంది?

ఎ) 332 బి)275

సి) పార్లమెంట్ చట్టం ద్వారా డి)334

4. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములను ఇతరులు కొనకుండా భూ బదలాయింపు నిషేధంచట్టం ఎప్పుడు రూపొందించారు?

ఎ) 1917 బి) 1959 సి) 1961 డి)1970

5. 50 శాతానికి మించి ఆదివాసులున్న ప్రాంతం?

ఎ)అస్సాం బి) మణిపూర్

సి) దాద్రానగర్ హవేలీ డి)సిక్కిం

6. 1991-2001 మధ్య కాలంలో ఆదివాసుల జనాభా పెరుగుదల?

ఎ) 24.5 శాతం బి) 22.66 శాతం

సి) 23.51 శాతం డి) 31.64 శాతం

7. గిరిజన ఉపప్రణాళికను (TSP) అమలు చేయడానికి ఏ వ్యవస్థ లను ఏర్పాటు చేశారు?

ఎ) ITDP బి) ITDA

సి)MADA డి) పైవన్నీ

8. గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య(TRIFED)ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?

ఎ) 1984 బి) 1987 సి) 2002 డి) 2003

9. పరిశ్రమలను ఏర్పాటు చేయటం వల్ల ఉపాధిని, భూమిని కోల్పో యిన గిరిజనులకు పునరావాసం కల్పించడానికి కేంద్రప్రభుత్వం జాతీయ విధానాన్ని ఎప్పటి నుంచి అమల్లోకి తెచ్చింది?

ఎ)2001 బి) 2004 సి) 2005 డి) 2007

10. 339వ ప్రకరణ కింద?

ఎ) షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ ఏర్పాటు

బి) ఉచిత న్యాయ సలహా

సి) ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు

డి) షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి రాష్ట్ర ప్రభు త్వాలకు కేంద్రం జారీ చేసే ఉత్తర్వులు

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10
	C	A	B	D	C	A	D	B	B	D

అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం

భారత ఉపఖండంలో దాదాపు ప్రపంచంలోని అన్ని ముఖ్య మతాలకూ చెందినవారు నివసిస్తున్నారు. మత ప్రాతిపదిక మీద దేశ విభజన జరిగినప్పటికీ, మతపరంగా అల్పసంఖ్యాక వర్గాలైన ముస్లింలు ఇండోనేషియా తర్వాత భారతదేశంలోనే ఎక్కువ మంది ఉన్నారు. జాతీయ అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ చట్టం-1992 గుర్తించిన అయిదు ముఖ్యమైన అల్పసంఖ్యాక వర్గాల్లో.. ముస్లింలు అతిపెద్ద వర్గం. 2001 జనాభా లెక్కల ప్రకారం వీరు 13.4 శాతం. లౌకిక భావానికి ప్రాధాన్యతనిచ్చే భారత రాజ్యాంగం అల్పసంఖ్యాక వర్గాలకు కొన్ని ప్రత్యేక రక్షణలను కల్పించింది. 25 నుంచి 28 ప్రకరణలు మత స్వాతంత్ర్య హక్కుకు సంబంధించినవి, అయితే 29, 30 ప్రకరణలు భాష, సాంస్కృతికపరమైన హక్కులను కల్పిస్తాయి. అవి ప్రాథమిక హక్కులలో అంతర్భాగం. వీటితో పాటు 350(ఎ) ప్రకరణ కింద భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు ప్రాథమిక విద్య మాతృభాషలో పొందే హక్కు కల్పించారు. 350(బి) ప్రకరణ కింద భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాల క్లేశాలను నివారించడానికి ప్రత్యేక అధికారిని నియమించవచ్చు.

సంఖ్యాపరంగా ముస్లింలు అతిపెద్ద అల్పసంఖ్యాక వర్గమైనప్పటికీ ఆర్థిక, రాజకీయ రంగాల్లో వీరు మిగిలిన అల్పసంఖ్యాక వర్గాల కన్నా (బౌద్ధులు మినహా) బాగా వెనకబడి ఉన్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని 1983, మేలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు 15 సూత్రాల కార్యక్రమాన్ని లేఖ ద్వారా ప్రతిపాదించారు. 28.8.1985న నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ ఈ సూత్రాలను పునరుద్ఘాటిస్తూ ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను అంచనా వేయడానికి న్యాయమూర్తి రాజేంద్ర సచార్ అధ్యక్షతన 'ప్రధానమంత్రి ఉన్నత స్థాయి కమిటీ'ని 2005లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది తన నివేదికను 2006లో సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా ప్రస్తుత ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సవరించిన 15 సూత్రాల పథకాన్ని ముఖ్యమంత్రుల ముందుంచారు.

సచార్ కమిటీ నివేదిక ప్రకారం ముస్లింలు అన్ని రంగాల్లో వెనకబడినట్లు తెలుస్తుంది. 13.4 శాతం జనాభా ఉన్న వీరు ప్రభుత్వ ఉద్యోగాల్లో 4.9 శాతం మాత్రమే. అఖిల భారత సర్వీసుల్లో వీరి ప్రాతినిధ్యం 3.2 శాతం మాత్రమే. కేంద్రంలో అతిపెద్దదైన రైల్వే మంత్రిత్వ శాఖలో 4.5 శాతం ముస్లింలు ఉద్యోగాల్లో ఉన్నారు. దేశం మొత్తంలో అసోం, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో వీరి జనాభా వరుసగా 30.9 శాతం, 25.2 శాతం, 18.5 శాతం. ప్రభుత్వ ఉద్యోగాల్లో మాత్రం అసోంలో 10.9 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 4.7 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 7.5 శాతం మాత్రమే. విద్యారంగం లో షెడ్యూల్డ్ కులాలు, తెగల కన్నా కొంత మెరుగైనప్పటికీ వెనకబడిన తరగతులు, ఇతర తరగతులతో పోలిస్తే వీరి పరిస్థితి నిరుత్సాహకరం. ముస్లిం పట్టభద్రుల శాతం కేవలం 3.4 శాతం మాత్రమే. హిందువుల 15.3 శాతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. జాతీయ సగటు అక్షరాస్యత 65 శాతం కానీ వీరిది 59 శాతం మాత్రమే. మదర్సాలలో 3 నుంచి 4 శాతం బాలబాలికలు హాజరవుతున్నారు. ఆర్థికంగా కూడా వీరి పరిస్థితి అంతంత మాత్రమే. ప్రణాళికా సంఘ అంచనాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు దేశం మొత్తం జనాభాలో 27 శాతం అయితే ముస్లింలలో ఇది 31 శాతం, పట్టణ ప్రాంతాల్లో ఇది 37 శాతం. ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు ఇతరులు నివసించే ప్రాంతాలతో పోలిస్తే చాలా తక్కువ. (విద్యాసంస్థలు, ఆసుపత్రులు, విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా మొదలైనవి) రాజకీయ రంగంలో కూడా వీరి ప్రాతినిధ్యం అంతంత మాత్రమే. 543 మంది సభ్యులున్న లోక్ సభలో ముస్లింలు 36 మంది మాత్రమే. ముస్లిం జనాభా గణనీయంగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేయడం, షెడ్యూల్డ్ కులాలు గణనీయంగా ఉన్న ప్రాంతాలను జనరల్ స్థానాలుగా నిర్ణయించడం ఆశ్చర్యకరమైన విషయం.

ముస్లింలను సంతతి ప్రాతిపదికన మూడు తరగతులుగా గుర్తించవచ్చు. మధ్య ఆసియా నుంచి బాబర్‌తో సహా వచ్చిన వారి సంతానం, హిందువుల్లో ఉన్నత కులాలకు చెంది, మొగలాయిల ప్రాబల్యం కోసం మతం మార్చుకున్నవారు అష్రాఫ్ తరగతికి చెందుతారు. వీరు సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉంటూ.. ఎలాంటి వివక్షకు గురికావడం లేదు. రెండో తరగతికి చెందిన అజ్లాఫ్స్ హిందువుల్లో వెనకబడిన తరగతులకు చెందిన వారితో సమానం. అట్టడుగున ఉన్న అర్జాల్స్ షెడ్యూల్డు కులాలకు చెంది, ఇస్లాం మతాన్ని స్వీకరించిన వారు. వీరు ప్రధానంగా కసాయి, చాకలి, క్షుర, పారిశుధ్య వృత్తులను చేపట్టారు.

సచార్ కమిటీ సిఫార్సులు

1) మతపరమైన అల్పసంఖ్యాక వర్గాల క్లేశ నివారణకు సమాన అవకాశాల కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
2) సామాజిక, మతపరమైన వర్గాలకు సంబంధించిన మౌలిక సమాచారాన్ని సేకరించి, శాశ్వత ప్రాతిపదికన భద్రపరిస్తే ఆయా వర్గాల ప్రయోజనాల కోసం విధానాలను రూపొందించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది.
3) అర్జాల్స్‌ను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చి, రిజర్వేషన్ సదుపాయాలు కల్పించాలి. అజ్లాఫ్‌లకు వెనుకబడిన తరగతుల హోదాను కల్పించి, ఆ సదుపాయాలను వర్తింపచేయాలి.

4) ప్రాతినిధ్య సంస్థల్లో వీరికి తగిన ప్రాధాన్యాన్ని కల్పించడానికి అవసరమైన చర్యలను చేపట్టాలి.

5) విద్యారంగంలో వీరు బాగా వెనకబడి ఉన్నారు. ముఖ్యంగా ముస్లిం బాలికలు మరింత వెనకబడి ఉన్నారు. ఉన్నత ప్రమాణాలు ఉన్న పాఠశాలను ఏర్పాటు చేయడం, మాతృభాష ఉర్దూలో ప్రాథమిక విద్యాబోధన, ఉపాధ్యాయుల్లో అల్పసంఖ్యాక వర్గాల మనోభావాలకు సంబంధించిన అవగాహన కల్పించడం, ప్రభుత్వ సర్వీసులకు, సైన్యంలోకి, బ్యాంకులలో వీరికి తగినంత ప్రాతినిధ్యం లభింపచేయడానికి పోటీ పరీక్షల్లో తర్పీదు నివ్వాలి.

6) ఆర్థిక పురోభివృద్ధికి జాతీయ స్థాయిలో వక్ఫ్ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటుచేసి.. దాని ద్వారా ఔత్సాహికులకు రుణ సదుపాయాలను కల్పించాలి. ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో వారు చేపట్టే వృత్తులకనుగుణంగా పరిశ్రమలను నెలకొల్పాలి.

7) వీరినుద్దేశించి చేపట్టిన కార్యక్రమాలను ప్రభావవంతంగా అమలు పరచడానికి, వాటి అమలును సమీక్షించడానికి స్వతంత్ర్య ప్రతిపత్తి ఉన్న వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

8) నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరణ చేసి, అల్పసంఖ్యాక వర్గాలు గణనీయంగా ఉన్న ప్రాంతాలను రిజర్వు చేయకుండా జనరల్ స్థానాలుగా మార్చాలి.

పై సిఫారసులను కేంద్ర మంత్రివర్గం 17.5.2007న ఆమోదించింది.

ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం

ఎ) విద్యారంగంలో అవకాశాలు విస్తృతం చేయడం

1) సమగ్ర శిశు అభివృద్ధి (ICDS) పథకాన్ని అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అమలుపరు స్తున్నారు. ముస్లింలు గణనీయంగా ఉన్న ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసి, బాలబాలికలకు పౌష్టికాహారాన్ని అందించ డంతో పాటు, ఆరోగ్య నిర్ధారణ పరీక్షల నిర్వహణ, పాఠశాల ప్రవేశపూర్వక విద్య.

2) సర్వశిక్ష అభియాన్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకాలు, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా ముస్లింలు నివసించే ప్రాంతాల్లో పాఠశాలల ఏర్పాటు

3) ఉర్దూ భాషా పండితులను ఎంపిక చేసి ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో మాతృభాషలో విద్యా బోధన

4) మదర్సా విద్యను ఆధునికీకరించడం

5) ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు

6) మౌలానా అజాద్ విద్య ఫౌండేషన్‌కు ప్రభుత్వం ధన సహాయాన్నందించి, దాని కార్యకలాపాలను విస్తృతం చేయడం

బి) ఆర్థిక కార్యకలాపాల్లో, ఉపాధి అవకాశాల్లో అల్పసంఖ్యాక వర్గాలకు తగిన వాటా కల్పించడం

7) బీదలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం. అందులో భాగంగా స్వర్ణజయంతి గ్రామ్ స్వరోజ్‌గార్ యోజన, స్వర్ణ జయంతి శహరి రోజ్‌గార్ యోజన, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ముస్లింలకు కొంతశాతం వనరులు, ఉద్యోగాలు కేటాయించడం

8) సాంకేతిక శిక్షణ ద్వారా యువతీ, యువకుల నైపుణ్యాన్ని పెంపొందించడం

9) బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా వ్యవసాయానికి, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు, స్వ యం ఉపాధి పథకాలకు, విద్య, గృహ నిర్మాణానికి రుణ సదుపాయాలను కల్పించడం

10) కేంద్ర, రాష్ట్ర సర్వీసులు, కేంద్ర పోలీస్ బలగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, రైల్వేశాఖల్లో ఉద్యోగాలు పొందడానికి తగిన శిక్షణ ఇవ్వడం

సి) అల్పసంఖ్యాక వర్గాల జీవన పరిస్థితులను మెరుగుపర్చడం

11) ఇందిరా ఆవాస్ పథకం కింద నిర్మించే గృహాలను పేద ముస్లింలకు వారి జనాభాకు తగినట్లుగా కేటాయించడం

12) అల్పసంఖ్యాక వర్గాలు నివసించే మురికి వాడలలో కనీస సౌకర్యాలు కల్పించడం

డి) మతపరమైన ఘర్షణలను నివారించడం/నియంత్రించడం

13) మతపరమైన అల్లర్లను నివారించేందుకు నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను జిల్లా మేజిస్ట్రేట్‌లుగా, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులుగా నియమించడం

14) మతపరమైన నేరాలను త్వరితగతిన విచారించి, నేరస్థులను కఠినంగా శిక్షించడం

15) మతపరమైన ఘర్షణల బాధితులకు తగిన నష్టపరిహారాన్ని వెంటనే అందించడం

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. భారత రాజ్యాంగం కింది అల్పసంఖ్యాక వర్గాలను గుర్తించింది?

ఎ) భాషాపరమైన బి) మతపరమైన
సి) భాష, మతపరమైన డి) కులపరమైన

2. జాతీయ అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ చట్టం ఎప్పుడు రూపొందించారు?

ఎ) 1992 బి) 1993 సి) 1950 డి) 1951

3. మతపరమైన, ధార్మిక విధులను నిర్వహించడానికి సంస్థలను ఏర్పాటు చేసుకొనే హక్కు ఏ రాజ్యాంగ ప్రకరణ ద్వారా సంక్రమించింది?

ఎ) 25 బి) 26 సి) 27 డి) 28

4. ప్రభుత్వ ధన సహాయంతో నడిచే విద్యాసంస్థల్లో మతపరమైన బోధనను నిషేధించే రాజ్యాంగ ప్రకరణ?

ఎ) 28 బి) 29 సి) 30 డి) 31

5. అల్పసంఖ్యాక వర్గాలకు విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, నిర్వహించే హక్కు కింది రాజ్యాంగ ప్రకరణ ద్వారా లభ్యమవుతుంది?

ఎ) 25 బి) 26 సి) 30 డి) 27

జవాబులు	1	2	3	4	5
	C	A	B	A	C